నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి 11:30 వరకు పీఅండ్‌టీ కాలనీ కౌంటర్, చౌరస్తా, కమ్యూనిటీ హాల్, కోదండరాంనగర్, హనుమాన్ టెంపుల్, వీవీనగర్, శారదానగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు జీపీ బ్యాంక్ కాలనీ, త్రివేణినగర్, వీకే ధాగేనగర్ పరిసర ప్రాంతాలో, మధ్యాహ్నం 2:30 నుంచి 3:30 వరకు భూలక్ష్మీనగర్, తిరుమలహిల్స్, గడ్డిఅన్నారం, కల్యాణ్‌నగర్ పరిసర ప్రాంతాలు, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు ఏపీఏయూ కాలనీ, గడ్డిఅన్నారం, వెంకటేశ్వర కామర్స్ కాలేజీ, తిరుమలహిల్స్, నేషనల్ ఇనిస్టిట్యూట్, ఇండస్ ల్యాండ్ బ్యాంక్, వాణిజ్య విహార్, నలందా కాలేజీ, బిగ్‌సీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణానికి చర్యలు


పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: డివిజన్‌లోని కాలనీల పార్కుల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆహ్లాదకర వాతావరణం పెంపొందేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ సైదాబాద్ ఆంధ్రా బ్యాంక్ కాలనీ పార్కును పరిశీలించారు. పార్కులో తగినన్ని బెంచీలు, గ్రాస్‌లాన్ ఏర్పాటు చేయాలని హార్టికల్చర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ మేనేజర్ యమునా, సూపర్‌వైజర్ రవి, ఉషశ్రీ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా 'భూవైజ్ఞానిక సర్వే' ఆవిర్భావ వేడుకలు


భాష్యం పాఠశాల విద్యార్థులతో మాథ్యూ జోసెఫ్

మన్సూరాబాద్: భారతీయ భూవైజ్ఞానిక సర్వే శిక్షణా సంస్థ(జీఎస్ఐటీఐ) 174వ ఆవిర్భావ వేడుకలు బండ్లగూడలోని ఆ సంస్థ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జీఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.మాథ్యూస్ జోసెఫ్ మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఖనిజ సంపదను గుర్తిస్తున్నామన్నారు. సంస్థ అభివృద్ధికి భూశాస్త్రజ్ఞులు అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. జీఎస్ఐటీఐ ఆవిర్భావ వేడులకు హాజరైన భాష్యం పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు.. రాక్‌గార్డెన్, మ్యూజియంను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో జీఎస్ఐ డీడీజీ ముచ్చటించారు. కార్యక్రమంలో టెక్నికల్ కో-ఆర్డినేషన్ డైరెక్టర్ ఎస్పీ భూటియా, డాక్టర్ గంజి మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవం

మన్సూరాబాద్: జీఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు సోమవారం జీఎస్ఐలో ఘనంగా జరిగాయి. జీఎస్ఐ మాజీ డైరెక్టర్ జనరల్ ఎం.రాజు, ఏడీజీ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీడీజీలు ఎల్‌పీ సింగ్, అన్షుమాన్ ఆచార్య, ఎస్ఎస్ పాత్ర, ఆల్ ఇండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదర్ల మహేశ్, సెక్రటరీ మధిర సత్యనారారాయణ, డైరెక్టర్స్ డా.ఎంఎల్ దొర, అనూప్ ఎన్ కాంబ్లే, శర్మ, ఎస్‌కే నాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం


కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: కాలనీలలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధి గణేశ్‌నగర్ కాలనీ ఫేజ్-1లో సోమవారం మార్నింగ్‌వాక్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విజయవాడ జాతీయ రహదారి రోడ్డు వెడల్పు పనుల కారణంగా పనామా రామ్‌రాజ్ కాటన్ వద్ద సివరేజి మ్యాన్‌హోల్స్ మూసి వెస్తుండటంతో సమస్య తలెత్తుతుందన్నారు. సివరేజి బోర్డు, ఆర్ అండ్ బీ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు సత్యనారాయణ, సతీశ్, సుధాకర్, రఘుపతిరావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌పై పాఠశాల ఇన్‌చార్జి అసభ్య ప్రవర్తన

నాగోలు: ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే మహిళ ఫ్యాకల్టీపై స్కూల్ ఇన్‌చార్జి వేధింపులకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు.. ఎల్బీనగర్ శివగంగా కాలనీలో రోడ్డు నంబర్-1లో ఉన్న శ్రీ చైతన్య హైస్కూల్‌లో ఓ మహిళ ఫ్యాకల్టీగా పనిచేస్తోంది. అయితే, పాఠశాల ఇన్‌చార్జి నాగరాజు ఆమెను కొంతకాలంగా మానసికంగా వేధిస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం సదరు మహిళా ఫ్యాకల్టీని తన క్యాబిన్ పిలిచి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు ఎల్బీనగర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా నాగరాజుపై కేసు నమోదైంది.

విధులకు వెళ్లిన యువతి అదృశ్యం

సైదాబాద్: ఇంటి నుంచి విధులకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. రెడ్డికాలనీలో నివసించే ఎ.రాధ సోదరి కల్పన(24) అలకాపురిలోని సంగీత్ రెస్టారెంట్‌లో రిసెప్షనిస్టుగా పని చేస్తుంది. రోజూ ఉదయం 6.30 గంటలకు ఇంటి నుంచి వెళ్లి మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి వస్తుంది. ఆదివారం ఉదయం విధులకు వెళ్తూ.. ఓవర్‌టైం డ్యూటీ చేసి రాత్రి 8 గంటలకు వస్తానని చెప్పింది. అయితే, సాయంత్రం రాకేశ్ అనే యువకుడు రాధకు ఫోన్ చేసి కల్పనని గుర్తుతెలియని వ్యక్తి వేధిస్తున్నాడని చెప్పాడు. ఈక్రమంలో రాధ తన చెల్లికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. కొంతసేపు తర్వాత వేరే నంబర్ నుంచి రాధకు కల్పన ఫోన్ చేసి.. తాను క్షేమంగా ఉన్నానని చెప్పి ఫోన్ పెట్టేసింది. ఆ తర్వాత ఆ ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో రాధ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మహిళా భవనం.. ఆశయం శిథిలం

తాగుబోతుల అడ్డాగా భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని బిల్డింగ్

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు




మహిళా మండలి భవనంలో చెత్తకుప్పలు, మద్యం సీసాలు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ మహిళా మండలి భవనం తాగుబోతులకు అడ్డాగా మారింది. ఈ భవనానికి విద్యుత్ కనెక్షన్లు లేవు. కనీసం తాగునీటి వసతి.. మరుగుదొడ్ల సైతం ఏర్పాటు చేయలేదు. ఫలితంగా భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అటు ప్రజాప్రతినిధులు కానీ.. అధికారులు కానీ పట్టించుకోకపోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో కొంతమంది తరచూ బహిరంగంగా మద్యం తాగుతున్నారని, పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

నిరుపయోగంగా..



మహిళా భవనంలో కనీస సౌకర్యాలు లేక శిథిలావస్థకు చేరింది. మంచి నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. సమస్యని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– నారగోని శ్రీనివాస్‌యాదవ్, అధ్యక్షుడు, భూపేశ్‌గుప్తానగర్ కాలనీ

ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలి..



మహిళా భవనంలో నిత్యం ఖాళీ మద్యం సీసాలు కనబడుతుంటాయి. లక్షలాది రూపాయల నిధులతో నిర్మించిన ఈ బిల్డింగ్‌లో కనీస వసతులు కూడా ఏర్పాటు చేయలేదు. వెంటనే సమస్యని జీహెచ్ఎంసీ అధికారులు పరిష్కరించాలి. ప్రజాప్రతినిదులు జోక్యం చేసుకుంటేనే సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి. – కందికంటి దీప, గృహిణి

అసాంఘిక కార్యకలాపాలు..



మహిళాభవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తాగుబోతులు తిష్టవేస్తున్నారు. రాత్రి వేళల్లో ఇటువైపు వచ్చే మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. పోలీసుల నిఘా లేకపోవడంతో నందనవనం కాలనీ, భూపేశ్‌గుప్తానగర్ కాలనీలో రోడ్లపైనే కొంతమంది తాగుతున్నారు. పోలీసులు నిఘాపెంచాల్సిన అవసరం ఉంది.
– మహ్మద్ రజియా, గృహిణి

ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్

లింగోజిగూడ: ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఐదు ఫిర్యాదులు అందినట్లు జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి తెలిపారు. వాటిలో నాలుగు టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి కాగా.. మరొకటి హార్టికల్చర్‌పై వచ్చాయన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

స్పందన కరువు..

చాదర్‌ఘాట్: ప్రతి సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైందని మలక్‌పేట సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూసీడీ, ట్యాక్స్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధే ప్రధాన లక్ష్యం


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చంపాపేట: డివిజన్ పరిధిలోని సమస్యలను ప్రాధాన్యక్రమంలో దశలవారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన దుర్గాభవానీ నగర్ కాలనీవాసుల ఫిర్యాదు మేరకు కాలనీలో పర్యటించి భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో తలెత్తే ఇబ్బందులపై కాలనీవాసులు సంయమనం పాటించాలని కోరారు. కాలనీలోని అంతర్గత రహదారుల మరమ్మతులు, కాలనీ సంక్షేమ సంఘ భవనం ఆవరణలో రేకుల షెడ్ ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘ ప్రతినిధులు ఈ సందర్భంగా కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, సభ్యులు నాగేశ్వరరావు, ఓంరెడ్డి, రాజేందర్‌గౌడ్, విఠలేష్, శ్రీనివాస రెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్

మలక్‌పేట: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు. కృష్ణతులసి నగర్‌లోని తన నివాసంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులతో కార్పొరేటర్ సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని సమస్యలు, పారిశుద్ధ్య నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా పని చేయాలని కార్మికులకు సూచించారు. పరిశుభ్రతలో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. రాంకీ సంస్థ ఇన్‌చార్జి దినేశ్, జీహెచ్ఎంసీ జవాన్ రమేశ్, ఎస్ఎఫ్ఏలు వై.శ్రీనివాస్, ముజీబ్, సుభాశ్, గణేశ్, శ్రీను, నర్సింగ్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే పేదలకు ఇళ్లు నిర్మించాలి


మాట్లాడుతున్న పాండురంగాచారి

నాగోలు: పొట్ట కూటి కోసం నగరానికి వచ్చి 30 ఏళ్లు గడుస్తున్నా చాలామంది సొంతిల్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కొత్తపేట తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య చౌరస్తాలోని వర్కర్స్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్.కుమార్ అధ్యక్షతన ఇల్లు లేని వారి కోసం సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాండురంగాచారి పాల్గొని మాట్లాడారు. గత పాలకులు అర్హులైన వారందరికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుపేదల వర్కర్స్ పార్టీ రాష్ట్ర నాయకత్వం పక్షాన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యని తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వర్కర్స్ పార్టీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను, రాజేశ్వరరావు, మధు, దీపక్, రాజ్, అలీషా, హైమావతి, దీపక్, సంతు ఎల్లయ్య, శివ పాల్గొన్నారు.

కేఎల్లార్‌కు చేవెళ్ల ఎంపీ సీటు ఇవ్వాలి

మహేశ్వరం: నిరంతరం ప్రజల కోసం పరితపించే నాయకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ సీటు కేటాయించాలని జల్‌పల్లి కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ తయ్యబ్ దయానీ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎన్నో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తున్న ఘనత కేఎల్లార్‌కే దక్కుతుందన్నారు. కాలనీలు, బస్తీల్లో పేదల దాహార్తి తీర్చేందుకు ఉచితంగా బోర్లు వేయించారని, లీడ్ ఇండియా సంస్థ స్థాపించి ఎన్నో కుటుంబాలకు పెద్ద దిక్కుగా మారారన్నారు. చేవెళ్ల టికెట్ ఆయనకు కేటాయిస్తే బంపర్ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ విషయమై మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు ఫ్యాక్స్ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు.

సీఐ పరుశురాంకు శుభాకాంక్షలు



నాగోలు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగోలు సీఐ పరుశురాం, ఎస్సై మధుని సోమవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి, నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పటి చిరంజీవి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

హస్తినాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ స్పష్టం చేశారు. సోమవారం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్‌కాలనీ ఫేజ్-1 కాలనీ ప్రతినిధులతో కలిసి కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జంగారెడ్డి, కాలనీ ప్రతినిధులు రాజు, మహేశ్, గోపాలరావు, రఘుపతిరెడ్డి, సృజన, నరేంద్రబాబు పాల్గొన్నారు.

'రాజీవ్ స్వగృహ' నూతన కమిటీ ఎన్నిక

నాగోలు: రాజీవ్ స్వగృహ(బండ్లగూడ) సహభావన టౌన్‌షిప్ ఏ బ్లాక్ ఫ్లాట్స్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సోమవారం ఎన్నికైంది. రిటర్నింగ్ అధికారి కేఎల్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. వట్నాల విశ్వేశ్వరరావు ప్యానల్, ఆత్మారావు చావలి ప్యానెల్, సొమ్ముటి శివకుమార్ ప్యానల్ పోటీలో నిలవగా అధ్యక్షుడిగా వట్నాల విశ్వేశ్వరరావు 42 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా కొలను గణేశ్, జనరల్ సెక్రెటరీ భూంపల్లి ప్రవీణ్‌రెడ్డి, కోశాధికారి కేవీఎల్ఎన్ మూర్తి, సెక్రటరీ వలిశెట్టి సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ వేముల శ్రీనివాసరావు, అసిస్టెంట్ కోశాధికారి వెల్లంపల్లి వేణుకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్నెం అవినాష్ విజయం సాధించారు. మరో 8 మందిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.


ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచి నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గతంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని శివారు కాలనీల్లో 18 కి.మీ.ల పైపులైన్ నిర్మాణం చేపట్టాలని జలమండలి ఎండీకి కలిసి ఎమ్మెలే వివరించారు. దీంతో పైపులైన్ మంజూరు కావడంతో ప్రారంభోత్సవానికి చర్యలపై సోమవారం ఎమ్మెల్యే జలమండలి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో మంచినీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తామని, ప్రతి శివారు కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి కూడా నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా అధికారులను కోరారు. కార్యక్రమంలో జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు రాజ్‌గోపాల్, రాజు, వాహిణి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఆటోనగర్ విభాగంలో తిరుమలనగర్ కాలనీ, డిఫెన్స్ కాలనీ, సావిత్రిబాయి పూలే కాలనీ, ఆర్టీసీ మజ్దూర్ కాలనీ, లక్ష్మీ భవానీ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, లక్ష్మీనగర్, స్వాతి రెసిడెన్స్, బ్లడ్ బ్యాంక్ కాలనీ, ప్రియదర్శిని కాలనీ, వసంత్ విహార్, మహేశ్వరి కాలనీ, ఆకాశ్‌నగర్, జిల్లా యాదవ్‌నగర్‌కు వాటర్ పైపలైన్ పనులు మంజూరయ్యాయి. కమలనగర్ విభాగంలో అల్లూరి కాలనీ, దుర్గానగర్, విజయ్‌నగర్ కాలనీ, నాగోలు విభాగంలో ఫతుల్లగూడ విలేజ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాలనీ, శ్రీ గణేశ్‌నగర్‌లో పైపులైన్ పనులు జరగనున్నాయి.

ఈటలను కలిసిన బీజేపీ నాయకులు


ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి


రాజేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

ఎల్బీనగర్: రాబోయే ఎంపీ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను ప్రకటించడంతో సోమవారం బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొంతం నవకిషోర్ రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్ రావు, భూపాల్‌రెడ్డి, రఘురాం, నరసింహారెడ్డి, శరత్‌కుమార్, సంతోశ్‌రెడ్డి, చందు, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, శంకరయ్య పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి

నాగోలు: ఈటల రాజేందర్‌ను సోమవారం కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్‌లో ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

'మోదీ పాలనలోనే మహిళా సంక్షేమం


నారీశక్తి వందన అభియాన్‌లో పాల్గొన్న సురేందర్‌రెడ్డి తదితరులు

మలక్‌పేట: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మహిళల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. నారీశక్తి వందన అభియాన్‌లో భాగంగా సోమవారం జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మంజులారెడ్డి ఆధ్వర్యంలో మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను సురేందర్‌రెడ్డి వివరించారు. మోదీ హయాంలో మహిళలకు చేయూత, ఆర్థికాభివృద్ధి జరుగుతోందన్నారు. మహిళలకు రిజర్వేషన్లు తీసుకొచ్చిన ఘనత బీజేపీకే దక్కిందన్నారు. దేశాభివృద్ధి కోసం మరోసారి బీజేపీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు దశరథ లక్ష్మి, మహిళ నేతలు పాల్గొన్నారు.

నేటి కూరగాయల ధరలు

వనస్థలిపురం, దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు.. టమోట రూ.11, వంకాయ రూ.28, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.50, కాకర రూ.38, బీర రూ.35, క్యాబేజి రూ.25, ఫ్రెంచి బీన్స్ రూ.50, క్యారెట్ రూ.21, దొండ రూ.31–35, చిక్కుడు రూ.35–50, గోకర రూ.40, బీట్‌రూట్ రూ.17, క్యాప్సికం రూ.55, ఆలు రూ.23, దోస రూ.21.

అనాథ విద్యార్థులకు ఆయనే 'మార్గం'


రాజేశ్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

నాగోలు: అనాథ, నిరుపేద విద్యార్థులకు చదువుకునేందుకు కృషి చేస్తున్న అనాథ విద్యార్థి గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్ సేవలు వెలకట్టలేనివని తెలంగాణ పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల 6వ వార్షికోత్సవం నాగోలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాజేశ్ ప్రభుత్వ సహకార శాఖ అధికారిగా పనిచేస్తూనే 32 సంవత్సరాలుగా అనాథ విద్యార్థులకు చదువులతో పాటు భోజనం, వసతి, పుస్తకాలు, దుస్తులు అందజేస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో 2019లో రాజేశ్‌ను పద్మరత్న బిరుదుతో సత్కరించామన్నారు. కార్యక్రమంలో భాగంగా రాజేశ్‌ను ఘనంగా సన్మానించారు. కవి, రచయిత వడ్డేపల్లి కృష్ణ, పద్మశాలి ఉద్యోగుల రాష్ట్ర నాయకులు తీరందాస్ యాదగిరి, డాక్టర్ గుర్రం నర్సింహారావు, యాదరిరేందర్, వడ్డేపల్లి నర్సింగరావు, కొండా యాదగిరి పాల్గొన్నారు.

వేడుకగా బచ్‌పన్ పాఠశాల స్నాతకోత్సవం


విద్యార్థులతో పాఠశాల రీజనల్ డైరెక్టర్ రూపారెడ్డి తదితరులు

వనస్థలిపురం: స్థానిక హిల్‌కాలనీలోని బచ్‌పన్ పాఠశాలలో సోమవారం స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బచ్‌పన్ అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్స్ రీజినల్ డైరెక్టర్స్ కె.శ్రీకాంత్ రెడ్డి, కె.రూపారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా రూపారెడ్డి మాట్లాడుతూ.. బాలలే దేశ ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులన్నారు. ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చివరిగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కల్పవల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



లింగోజిగూడ: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లేదా మంచినీరు వృథగా పోతున్న వాటర్ వర్క్స్ అధికారులు, సిబ్బంది పట్టించుకోడం లేదని ఆరోపణలు బలంగా వినిస్తున్నాయి. ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్ సర్వీస్ రోడ్డులో నిత్యం డ్రైనేజీ, మంచినీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రైనేజీ పొంగుతుండటంతో ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.